ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం, 25 జూన్ 2024 www.prajaaswaramdaily.com 2PM

# విద్యార్థి అనుమానాస్పద మృతి

హైదరాబాద్, జూన్ 25 (ప్రజాస్వరం): హైదరాబాద్ కొంపల్లిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కొంపల్లిలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థి అనుమానాస్పాదంగా మృతిచెందిన ఘటన కలకలంరేపింది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లిలోని శ్రీచైతన్య పాఠశాలలో మల్లికార్జున్ అనే బాలుడు ఏడో తరగతి చదవుతున్నాడు. సోమవారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. కాగా ఉదయం ఎంతకూ నిద్ర లేవక పోవడంతో విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలియజేశారు. వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, విద్యార్థి మృతికి పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి నాయకులు కోరారు.

# కేసీఆర్ అలర్ట్

### గ్రేటర్ ఎమ్మెల్యేలు, కీలక నేతలకు ఆహ్వానం
### పార్టీ మారొద్దని సూచన
### భవిష్యత్తు మనదేనని భరోసా
### ఎంతమంది హాజరవుతారోనని ఉత్కంఠ



### ఎమ్మెల్యేలు చేజారకుండా జాగ్రత్త
### ఫాంహౌస్‌లో సమావేశం

హైదరాబాద్, జూన్ 25 (ప్రజాస్వరం): బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అలర్ట్ అయ్యారు. ఎమ్మెల్యేలు చేజారకుండా జాగ్రత్తలు ప్రారంభించారు. ఇందుకోసం మంగళవారం తన వ్యవసాయ క్షేత్రంలో తమ పార్టీ ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్న క్రమంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. పార్టీ నేతలు భవిష్యత్తులో అనుసరించిన వ్యూహంపై దిశానిర్ధేశం చేయనున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ ను నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించి, భవిష్యత్తు తమదేనని భరోసా కల్పించినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేరుకున్నారు. ఇంకా సమావేశానికి ఎంతమంది వస్తారనే విషయంపై ఉత్కంఠ నెలకొన్నది.

## భవిష్యత్తు వ్యూహంపై దిశానిర్దేశం

ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్న పరిస్థితుల్లో నేటీ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఇప్పటి ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కూడా పార్టీని వీడుతారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే ఆయన డిల్లీకి చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో కేసీఆర్ అత్యవసర భేటీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకుండా ఆయన నియంత్రణా చర్యలకు దిగారు.అయితే ఈ సమావేశంలో ఎంతమంది ఎమ్మెల్యేలు పాల్గొంటారనేది ఉత్కంఠగా మారింది. కాంగ్రెస్ వైపు చూడకుండా నేతలకు ఎలాంటి హామీలు ఇస్తారనేది చూడాల్సి ఉంది. కాగా ఇవాళ జరగనున్న అత్యవసర భేటీకి గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా పిలిచినట్టు సమాచారం.

# అలక వీడని జీవన్‌రెడ్డి

### నచ్చజెప్తున్న అధిష్ఠానం
### రాజీనామా చేయోద్దని సూచన
### పలు దఫాలుగా చర్చలు
### ప్రాధాన్యం ఇస్తామని హామీ




హైదరాబాద్, జూన్ 25 (ప్రజాస్వరం): బీఆర్ ఎస్ నేత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ లో చేర్చు కోవడంపై సీనియర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి కినుక వహించారు. తీవ్ర అసంతృప్తికి గురై రాజీనామాకు సిద్ధమయ్యారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. అది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడికి లేఖలు పంపించినట్లు ప్రకటించారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాలమేరకు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్, మరో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ ఆయనకు నచ్చజెప్పి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం మంత్రి శ్రీధర్ బాబును నివాసానికి వచ్చి జీవన్ రెడ్డితో చర్చించారు. తాను ఇంతకాలం పార్టీలో గౌరవంగా కొనసాగానని, గౌరవంగానే తప్పుకుంటానని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం.

### పార్టీని వీడను

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ చేశారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినట్లు సమాచారం. మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జీవన్ తో చర్చించారు. అనంతరం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. చేరికల విషయంలో మనస్థాపం చెందానని తెలిపారు. తాను ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్నానని.. ఎమ్మెల్సీగా అసెంబ్లీకి వెళ్లే హక్కు తనకు ఉందని పేర్కొన్నారు. కార్యకర్తలు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటానని జీవన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. దీంతో ఆయన రాజీనామా చేయకపోయినా పార్టీపై అలక మాత్రం వీడలేదని అర్థమవుతున్నది.

## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం.. ఒకరి మృతి..





పటాన్‌చెరు, జూన్ 25 (ప్రజాస్వరం): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సుతారి గూడ గ్రామం వద్ద పటాన్ చెరువు నుండి మేడ్చల్ వైపు వస్తుండగా ఆగి ఉన్న కంటైనర్ ను డీసీఎం ఢీ కొట్టింది. దీంతో డీసీఎం డ్రైవర్ వాహనాన్ని దిగి తనిఖీ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో కంటైనర్ డీసీఎం డ్రైవర్‌ను ఢీకొట్టింది. డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ మండలంలోని సుతారిగూడ గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ రవికుమార్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

### నేడు తెలంగాణ ఎంపీల ప్రమాణస్వీకారం...
## హాజరుకానున్న సీఎం



ఢిల్లీ, జూన్ 25 (ప్రజాస్వరం) : పార్లమెంట్ సమావేశాలు రెండో రోజు మంగళవారం కొనసాగనున్నాయి. మొదటి రోజు సోమవారం కొత్తగా ఎన్నికైన ఎంపీలు 262 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఈరోజు మరో 281 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. అలాగే తెలంగాణ నుంచి ఎన్నికైన ఎంపీలు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ప్రమాణస్వీకారానికి సీఎం రేవంత్ రెడ్డి , మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి మండలి సహా... పలు రాష్ట్రాల ఎంపీలు నిన్న ప్రమాణం చేశారు. ఆంగ్ల అక్షర క్రమంలో రాష్ట్రాల వారీగా 262 మందితో ప్రొటెం స్పీకర్ భతృహరి మెహతాబ్ ఎంపీలుగా ప్రమాణం చేయించారు.

## గంజాయి మత్తులోకి దించి..



హైదరాబాద్, జూన్ 25 (ప్రజాస్వరం): చట్టాలు ఎంత కఠినంగా అమలవుతున్నా మహిళలపై లైంగికదాడులు ఆగడంలేదు. మృగాళ్ల వైఖరిలో మార్పు రావడంలేదు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్న యువకులు ఆ మత్తులోనే దారుణాలకు ఒడిగడుతున్నారు. తాజాగా హైదరాబాద్ నేరేడ్ మెట్ లో లుగుచూసిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. గంజాయి మత్తులోకి దించి ఐదుగురు మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డ ఘటన కలకలం రేపుతోంది. కాచిగూడలో నివసిస్తున్న మైనర్ బాలికకు ఐదుగురు యువకులు గంజాయి అలవాటు చేశారు. ఆమె మత్తులోకి దిగగానే లైంగిక దాడుల కు ఒడిగడుతున్నారు. జరిగిన ఘోరాన్ని బాలిక తల్లికి చెప్పకుండా దాచిపెట్టింది. కాగా, శరీరంలో మార్పులు రావడంతో గమనించిన తల్లి నిలదీసింది. దీంతో అసలు కథ బయటికి వచ్చింది. బాలిక తనకు జరుగుతున్న ఘోరాన్ని తల్లికి వివరించింది. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించింది. కాచిగూడ స్టేషన్ లో కేసు నమోదు చేసిన పోలీసులు నేరేడ్మెట్ కు బదిలీ చేశారు. బాలికపై అత్యాచారం చేసిన యువకుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. స్థానికంగా ఈ ఘటన తీవ్ర చర్చ నీయాంశం అవుతోంది.